RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 92 | పేజీలు : 4 | ఆదివారం 4 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్ఓసీ.. 24 మీటర్ల వరకు మినహాయింపు



ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం చంద్రబాబు

ద్వారానే సాధ్యం

- బుర్రిపాలెంలో శివరాజ్ సింగ్ చౌహాన్
- తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో కార్యక్రమం
- 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన
- హాజరైన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు కోరిక మేరకు మరిన్ని ఇళ్లు ఇస్తామని శివరాజ్ సింగ్ హామీ
- జగన్ పాలనలో ఏపీ నాశనమైందని, పేదల ఇళ్లను అడ్డుకున్నారని విమర్శ
- చంద్రబాబు విజన్‌తో ఏపీ దేశంలోనే నంబర్ వన్ అవుతుందని ఉద్ఘాటన

3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు



- చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు
- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్

అమరావతి

ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ.14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు - మిగతా3లో



రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి

చంద్రబాబుకు పంపిస్తున్నాడు

కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్

రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు




శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా
- శనివారం శ్రీవారిని 91,296 మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.5.06 కోట్ల ఆదాయం

అమల్లోకి కొత్త మున్సిపల్ చట్టం

- ఇకపై సేవలు మంరిత సులభం!
- హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది.
- ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 70 ఏళ్ల నాటి జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ రీజియన్ చట్టం--2026 తీసుకొచ్చింది.
- అక్టోబర్ 2 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది



హైదరాబాద్

హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. మున్సిపల్ శాఖను స్వయంగా చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నగర పాలనపై నేరుగా పర్యవేక్షణ సాగించేలా కొత్త వ్యవస్థలో కీలక మార్పులు చేశారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ పనిచేస్తుంది. నగరాభివృద్ధి ప్రాధాన్యాలను ఈ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. కార్పొరేషన్లు, పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, హైడ్రా అధికారులు ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కొత్త చట్టంలోకి వచ్చింది. 1955లో పాత మున్సిపల్ చట్టం వచ్చినప్పుడు హైదరాబాద్ జనాభా సుమారు 15 లక్షలు. ఇప్పుడు కోర్ అర్బన్ రీజియన్‌లో దాదాపు 1.3 కోట్ల మంది నివసిస్తున్నారు. నగరం భారీగా విస్తరించింది. వరదలు, ఎండ తీవ్రత, వాయు కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్, చెరువులు--నాలాల ఆక్రమణలు, ఎత్తైన - మిగతా3లో



కొత్త జాబ్ కార్డుల జారీకి

లైన్ క్లియర్

- గ్రామీణులకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఉపాధి హామీ పథకం కింద కొత్త జాబ్ కార్డుల జారీకి ఆమోదం
- కరువు పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డుల విడుదలకు సిద్ధమైంది

హైదరాబాద్

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎల్‌నినో పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌నినో ప్రభావంతో గతంతో పోలిస్తే సాధారణ వర్షపాతం భారీగా పడిపోయింది. - మిగతా3లో



ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి

సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం

దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు

దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

ఆదివారం 4 అక్టోబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

గోరంట్ల బలిజలతో...

ఆత్మీయతను పంచుకున్న గంట రవితేజ.



గోరంట్ల సూపర్ 04 సీమ వార్త సాయంత్రం. స్థానిక కే కే కంఫర్ట్ ఫంక్షన్ హాల్ గోరంట్ల నందు ఆత్మీయ సమావేశానికి గంటా రవితేజ హాజరయ్యారు.బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తూ మధ్యలో గోరంట్ల కే కే కంఫర్ట్ ఫంక్షన్ హాల్ గోరంట్ల నందు ఏర్పాటు చేసిన బలిజల ఆత్మీయ సమావేశానికి యువ నాయకుడు గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ గారు హాజరయి బలిజ కమ్యూనిటీ ప్రజలు, నాయకులు మరియు యువతతో ఆత్మీయంగా కలుసుకుని, వారితో ఒక అరగంట పాటు ముఖాముఖి అందరినీ ఆత్మీయంగా పలుకరించారు. ఇంత మందితో కలవడం చాలా ఆనందంగా ఉందని ప్రస్తుతం ఒక కార్యక్రమానికి వెళ్లే తొందరలో ఉన్నానని మరొకసారి వచ్చి ప్రశాంతంగా అందరితోనూ ఏకాంతంగా మాట్లాడతానని, అందరూ ఒకరికొకరు సహకరించుకుంటూ మంచి ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బలిజ సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అనంతలో... హెరిటేజ్ వాక్..!!

....చారిత్రక వారసత్వ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యం..

హెరిటేజ్ వాక్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, తదితరులు..



అనంతపురం, అక్టోబర్ 04 సీమ వార్త సాయంత్రం.

తరతరాల అనంతపురం యొక్క ఘన చరిత్ర, సంస్కృతి, వారసత్వం మరియు ప్రాచీన కట్టడాల యొక్క పరిరక్షణ మరియు ఘనతను కేవలము నేటి తరం యొక్క పరిరక్షణ బాధ్యత మాత్రమే కాకుండా భావితరాలకు అందించటంలో భాగంగా ఆదివారం హెరిటేజ్ వాక్ కార్యక్రమము జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సూచనలతో జిల్లా పురావస్తుశాఖ ఆధ్వర్యంలో - మిగతా3లో









ప్రొద్దుటూరు గడ్డపై... జల జీవన్‌కు శ్రీకారం..!!

.....ప్రొద్దుటూరులో జల జీవన్ మిషన్ కార్యక్రమ సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సవితమ్మ

.....30 వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

ప్రొద్దుటూరు అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం.





కడప జిల్లా జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.30 వేల కోట్ల నిధులతో రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి ప్రాజెక్టుల కల్పనకు 5 వతేదీన ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ పరిశీలించారు.ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను, వేదిక నిర్మాణం, ప్రజలకు కల్పించనున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత నాయకులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొననున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ భూపేశ్ రెడ్డి, శ్రీ సత్యనారాయణ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీ జయప్రకాశ్‌తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బలిజల ఉనికి కాపాడుకుందాం...

ఐక్యత సాధిద్దాం..!!

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేద్దాం

కాపుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ లు ప్రత్యేక కృషి

గంటా ఫ్యామిలీ పై ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల అభిమానం మరువలేనిది

గోరంట్ల అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం.





త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో కలసికట్టుగా పనిచేసి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని మంత్రి గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ తెలిపారు, ఆదివారం అనంతపురం జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన గంటా రవితేజ గోరంట్ల మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకుల కోరిక మేరకు పట్టణంలోని కేకే కంఫర్ట్ ఫంక్షన్ హాల్ నందు కాపు కులస్తుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన కీర్తిని కొనియాడారు, అనంతరం ఆయన మాట్లాడుతూ కాపుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని వారి కృషి మరువలేనిది అన్నారు, ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు,గంట శ్రీనివాసరావు ఫ్యామిలీ పై అనంతపురం జిల్లాలోని మంత్రి సబితమ్మతోపాటు ఎంపీపీ పార్థసారథి తదితర ఎంపీ ఎమ్మెల్యేలు వారి అభిమానం మరువలేనిది అన్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా గంటా రవితేజకు కూటమి నాయకులు పూలమాలు శాలువాలతో ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో హస్త కళల డైరెక్టర్ పులేరు సోమశేఖర్, ప్రిన్సిపాల్ భక్తవత్సలం, పులేరు హరి, నరేంద్ర రాయల్, బాలాజీ,గాజుల వేణుగోపాల్, టెక్స్ టైల్స్ లక్ష్మీ నారాయణ,సత్యనారాయణ రెడ్డి,శ్రీనివాసులు, జనసేన సంతోష్ కుమార్,గాజుల రమేష్,జగదీష్,వెంకటేష్, విశ్వనాథ్ తో పాటు బలిజ కులస్తులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం
ఆదివారం 4
అక్టోబర్ 2026

అనంత ఆత్మీయతను ఎన్నటికీ మరువలేను...!!







...రాయల్ మురళి నివాసంలో గంటా రవితేజ తేనీటి విందు.

.....ఆత్మీయులను కలవడం ఎంతో సంతోషకరం : గంటా రవితేజ

అనంతపురం , అక్టోబర్ 04 సీమ వార్త సాయంత్రం. అనంతపురం నగరంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి నివాసానికి మాజీ మంత్రి, శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ విచ్చేశారు. రాయల్ మురళి స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ రాయల్ మురళి నివాసానికి రావడం, ఇక్కడ ఎందరో ఆత్మీయులను నేరుగా కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొంటూ మురళికి కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం రాయల్ మురళి మాట్లాడుతూ తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన రవితేజకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి, శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావుతో పాటు ఇతర ముఖ్య కాపు నాయకులు ఎల్లవేళలా కాపు సామాజిక వర్గానికి అండగా నిలుస్తున్నారని, భవిష్యత్తులో కూడా ఇదే రీతిన పూర్తి సహకారం, మద్దతు అందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మడకశిర శాసనసభ్యుడు ఎమ్మెస్ రాజు, ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు కేశవరెడ్డి, పట్టణ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ చెల్లా లక్ష్మీప్రసాద్, ముత్తువల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేయం షకీల్ షఫీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేఎం హర్షద్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, వైఎండి తాజుద్దీన్, జేసి శ్రీకాంత్, ఐఎమ్ఎమ్ బాషా, మార్కెట్ మహేష్, కాయగూరల విశ్వనాథ్, జనసేన పార్టీ నాయకులు కాయగూరల లక్ష్మీపతి, భవాని రవికుమార్, గల్లా హర్ష, కోలా తేజ, రాయల్ భాస్కర్, వలిగిరి నగేష్, ఒలిగిరి మునీంద్ర, వెంకట్ రాముడు, చలం రాజా, నల్లప్ప, కాపునాడు నాయకులు పూల పాండురంగయ్య, రాపా ధనుంజయ, సాయి సంపత్ నాయుడు, పట్టణ బ్యాంక్ ఉపాధ్యక్షుడు గోల్డ్ బాషా, సునీల్, అనిల్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పల్లె పిలుపుతో...పల్లెల్లో వీధి లైట్లు వెలుగులు.

చెరువాండ్ల పల్లిలో వీధి లైట్లు ఏర్పాటు చేసిన తెలుగుదేశం నాయకులు



నల్లమాడ అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం. మండలం లోని చెరువాండ్లపల్లి, కొత్తపల్లి లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశాల వీధిలైట్లు తెలుగుదేశం నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, పుట్ల రవీంద్ర మాట్లాడుతూ పల్లె సింధూర రెడ్డి ఒకటో తారీకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ,37 సిమెంటు రోడ్లు శంకుస్థాపన శుభ సందర్భాన ప్రజలు వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రజలు ఎమ్మెల్యే ని కోరారు అక్కడే ఉన్న తెలుగుదేశం నాయకులకు వివరించగా తక్షణమే స్పందించిన తెలుగుదేశం నాయకులు వీధిలైట్లు ఏర్పాటు చేయనమైనది, మీ సమస్యలు ఉన్న తెలియజేయాలని అలాగే అక్కడే ఉన్న మహిళలను కోరగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారని అందరికీ అందుబాటులో ఉండి పార్టీలకు అతీతంగా వారి సమస్యలు తీరుస్తున్నారని, కూటమి ప్రభుత్వం మంచి పనులు చేస్తున్నదని తల్లికి వందనం, రైతు భరోసా, మధ్యాహ్నం భోజనం, స్కూల్ పిల్లలకు నాణ్యమైన భోజనం, పుస్తకాలు, స్కూల్ డ్రెస్, ఉచిత గ్యాస్, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, ఎన్నో పథకాలు ప్రజలకు అందుతున్నాయని, పెండింగ్ లో ఉన్న రోడ్లను పూర్తి చేయడం జరిగిందని, ఇది మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ప్రజల స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తెలిపారని తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కొట్లో మంజూ రెడ్డి, పుట్ట రవీంద్ర, పఠాన్ బాబావాలి, అరవింద్ బాబు, డీలర్ రమేష్ రెడ్డి, ఎమ్మెస్ లీడర్ వనజ, అనిమేటర్ రామచంద్ర, మధుసూదన్ రెడ్డి, పాల నరసింహులు, గంగిరెడ్డి, చిన్న నరసింహులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిఖా వేడుకలో పాల్గొన్న సుగవాసి ప్రసాద్‌బాబు, చప్పిడి మహేష్ నాయుడు



పీలేరు, అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం. పీలేరు పట్టణంలోని నాగిరెడ్డి మెగా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నిఖా వేడుకకు ఖాన్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆత్మీయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అల్లాహ్ ఆశీస్సులతో నూతన దంపతుల జీవితం ప్రేమానురాగాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉశీడాలని కోరుకున్నారు. నిఖా వేడుకను నిర్వహించిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ నాగారపమ్మ తల్లికి పూజలు



టి సుండుపల్లె అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం. మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ బండకాడ ఈడిగ పల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లిని ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అనంతలో... హెరిటేజ్ వాక్..!!

-మొదటిపేజీ తరువాయి

అనంతపురము నగరంలోని ఓల్డ్ టౌన్ లో ఉన్న తొలి ఆసుపత్రిగా పేరుగాంచిన విక్టోరియా మెమోరియల్ హాస్పిటల్ వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ చెన్నకేశవ స్వామి దేవాలయం, విరూపాక్ష స్వామి దేవాలయం, జామియా మసీదు, బసవన్న కట్ట, ఐరన్ బ్రిడ్జ్ మీదుగా ఉత్సాహభరిత కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ మన అనంతపురం జిల్లా ఎన్నో ప్రాచీన కట్టడాలకు ప్రసిద్ధి పొందినదని, క్రీస్తు శకం 15వ శతాబ్దం నుండి నేటి వరకు అనేక కట్టడాలు మన అనంతపురం జిల్లాలో ఉన్నాయని తెలియజేశారు. వీటిని పరిరక్షిస్తూనే, ఆ కట్టడాల యొక్క స్ఫూర్తిని మరియు ఘనతను భావితరాల వారికి అందించేందుకు జిల్లా యంత్రాంగము కృషి చేస్తుందని తెలియజేశారు. మన రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా, మన అనంతపురం జిల్లా యొక్క ప్రాచీన కట్టడాలు మరియు వాటి యొక్క ఘనతను ప్రజల్లో తీసుకెళ్లే విధంగా బ్లూ ప్లేక్ అనే కాన్సెప్ట్ ని తయారు చేయించడం జరిగిందని వివరించారు. ప్రతి వారసత్వ కట్టడాన్ని పరిరక్షేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ మాట్లాడుతూ హెరిటేజ్ వాక్ కార్యక్రమము ఇకమీదట మన జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, మరియు మన వారసత్వం యొక్క ఘనతను తెలుసుకోవాలని వారి ఇరువురు పిలుపునిచ్చారు. ప్రతి చారిత్రక కట్టడం వద్ద గైడర్ గా కళాశాల విద్యార్థినులు ఆయా కట్టడాల చారిత్రక నేపథ్యం, నిర్మాణ విశిష్టత, ప్రాధాన్యతలను ఎంతో చక్కగా వివరించారు. విద్యార్థినుల వివరణలు పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. హెరిటేజ్ వాక్ ముగింపు కార్యక్రమం ఐరన్ బ్రిడ్జ్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా పలువురు హెరిటేజ్ వాకర్స్ మాట్లాడుతూ, తాము ప్రతిరోజూ ఈ చారిత్రక కట్టడాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, వాటి వెనుక ఉన్న చరిత్ర, ప్రాధాన్యత గురించి ఇంతవరకు పూర్తిగా తెలుసుకోలేకపోయామని తెలిపారు. ఈ హెరిటేజ్ వాక్లో పాల్గొనడం ద్వారా అనంతపురము నగరంలోని చారిత్రక వారసత్వ సంపద గురించి సమగ్రంగా తెలుసుకునే అవకాశం లభించిందని, ఇకపై ఈ కట్టడాల పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్, హెరిటేజ్ వాకర్స్, ఆయుష్ మెడికల్ అధికారి లాల్యానాయక్, నగర ప్రముఖులు, స్వచ్ఛంద కార్యకర్తలు, గైడ్స్, పురావస్తు శాఖ, మున్సిపల్ శాఖ మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు..

-మొదటిపేజీ తరువాయి

టెక్నాలజీ గురించి వివరించారు.

ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

9 లక్షల ఇళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మీ అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం చంద్రబాబు ద్వారానే సాధ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్త ఆకాంక్షలు నెరవేర్చగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. చంద్రబాబు ఒక డైనమిక్, డెడికేటెడ్, డెసిసివ్ నాయకుడని, ఆయన విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని కొనియాడారు. తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో జరిగిన 3 లక్షల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల కలలను సాకారం చేయడానికి చంద్రబాబు నాయకత్వం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

టెక్నాలజీతో రాష్ట్రాభివృద్ధికి బాటలు

భవిష్యత్తులో దేశానికి అతిపెద్ద శక్తి టెక్నాలజీయేనని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారని శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అభివృద్ధిపై ఆయన విజన్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆయన నిబద్ధత, కఠోర శ్రమతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఐకాన్‌గా నిలుస్తుంది" అని చౌహాన్ పేర్కొన్నారు.

జగన్ పాలనలో సర్వనాశనం

గత ఐదేళ్లలో జగన్ తన విధ్వంసకర వైఖరితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చౌహాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఇళ్ల కోసం నిధులు పంపితే, జగన్ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా ఆ పథకాన్ని నీరుగార్చింది. పేదల సొంతింటి కలను చిదిమేసింది. కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించి పాపం చేసింది. జగన్‌ను ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే, ఈపాటికే పేదలందరికీ ఇళ్లు ఉండేవని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని రాజధాని లేకుండా వదిలేస్తే, జగన్ మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం భరోసా

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించాలని సంకల్పించారని శివరాజ్ సింగ్ తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రానికి 76,000 ఇళ్లు మాత్రమే వస్తాయని అధికారులు చెప్పారు. కానీ చంద్రబాబు గారు అందరికీ ఇళ్లు కావాలని, ఇంకా ఎక్కువ కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తొలి విడతగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఇవాళ బాబు గారు ఇవి కూడా చాలవు, మరో 6 లక్షల ఇళ్లు కావాలని అడిగారు. తప్పకుండా ఇస్తాం. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షలు ఇచ్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రధాని మోదీ ఆశీస్సులతో, చంద్రబాబు నాయకత్వంలో నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించడం దేశానికే ఆదర్శమని, ఇది సమయాన్ని, ఖర్చును తగ్గిస్తుందని ప్రశంసించారు.

మోదీ-బాబు నాయకత్వంలో 360 డిగ్రీల అభివృద్ధి

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తున్నారని చౌహాన్ అన్నారు. "మోదీ, బాబు అంటే ఒకటి ం ఒకటి = రెండు కాదు.. ఒకటి ం ఒకటి = పదకొండు. వారితో పవన్ కల్యాణ్ కూడా తోడయ్యారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేశాం. రాష్ట్రానికి రూ. 15,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. జగన్ సర్కారు పక్కన పెట్టిన పోలవరం ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.

మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్రంలోని ఏ సోదరి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 23 లక్షలుగా ఉన్న లఖ్‌పతి దీదీల సంఖ్యను 60 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే 'సరస్ మేళా'ను తొలిసారిగా ఢిల్లీ నుంచి బయటకు తీసుకొచ్చి, అక్టోబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇది మహిళల పాలిట కుంభమేళా అవుతుందన్నారు. రైతుల కోసం కేంద్రం ఇస్తున్న రూ. 6,000కు అదనంగా, చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' కింద మరో రూ. 14,000 కలిపి మొత్తం రూ. 20,000 అందించి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు. "చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇక సర్వీవింగ్ స్టేట్ కాదు, షైనింగ్ స్టేట్‌గా మారింది. ఆస్పిరేషనల్ ఆంధ్ర, యాంబిషియస్ ఆంధ్ర, ఆసమ్ ఆంధ్రగా రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఒక్కరి కలలను నెరవేర్చే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది" అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగాన్ని ముగించారు.

రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

వెంకటపల్లెలో విషాదం..

పాము కాటుకు గురై రైతు మృతి



తాడిపత్రి, అక్టోబర్ 04 సాయంకాలం (సీమ వార్త): తాడిపత్రి మండలం వెంకటపల్లె గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డే దేరంగుల చంద్ర (52), తండ్రి: వెంకటేష్ తన ఇంటి వెనుక పొలంలో యూరియా వేస్తుండగా గుర్తుతెలియని విషపూరిత పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన చంద్రను కుటుంబ సభ్యులు హుటాహుటిన తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పెద్దపాలమడలో విషాదం...

భార్య మాటలకు మనస్తాపం చెంది కూలీ బలవన్మరణం



తాడిపత్రి, అక్టోబర్ 04 సాయంకాలం (సీమ వార్త): తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపాలమడ గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గాజుల రవి కుమార్ (42), తండ్రి నారాయణ స్వామి నల్లబండల ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుమారు 10 రోజుల క్రితం ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ఎడమ చేతికి గాయం కావడంతో వైద్యుల సూచన మేరకు మందులు వాడుతున్నాడు. మద్యం సేవించే అలవాటు ఉండటంతో మందులు పూర్తయ్యే వరకు మద్యం సేవించవద్దని భార్య గాజుల నాగేశ్వరి (38) మందలించింది. ఈ క్రమంలో నిన్న సాయంత్రం సుమారు 5.30 గంటలకు నాగేశ్వరి ఇంటికి వచ్చి చూడగా, రవి కుమార్ వంటగదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో తుపాకుల పెద్దిరాజు, రవి కుమార్ ఆచారి అక్కడికి వచ్చి తలుపులు తెరిచి కిందకు దించారు. అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయని స్థానికులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని జింక మృతి



తాడిపత్రి, అక్టోబర్ 04 సాయంత్రం (సీమ వార్త): తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లి గ్రామ పరిధి యస్ఆర్ విల్లాస్ సమీపంలో విషాద ఘటన చోటు చేసుకుంది. నంద్యాల నుండి తాడిపత్రి టౌన్ కు వస్తున్న ఆర్టీసీ బస్సు నంబర్ ఏపీ 02 జెడ్ 0522 ను జింక ఢీకొంది. బస్సు వెనుక వైపు బలంగా తగలడంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. జింక అడవి ప్రాంతం నుండి జనావాసాల వైపు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతి చెందిన జింకను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అటవీ శాఖ అధికారులు పంచనామా నిర్వహించారు.

సీపీఐ పార్టీ కార్యాలయానికి 30 వేల విలువైన కుర్చీలు అందజేత

దాతలు భాస్కర్, భాజా కు ఘన సత్కారం



యాడికి అక్టోబర్ 04 సీమ వార్త సాయంకాలం యాడికి మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యాలయానికి దాతలు 30 వేల రూపాయలు విలువ చేసే 40 కుర్చీలను ఆదివారం అందజేశారు ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ సీపీఐ పార్టీ అభిమాని సామాజికవేత్త స్టాంపు రైటర్ జూటూరు అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో దాతలు గుత్తి రోడ్డులోని పెట్రోల్ బంకు యజమాని భాస్కర్ కన్స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ ఖాజా 30 వేల రూపాయలు విలువ చేసే కుర్చీలను సీపీఐ పార్టీ కార్యాలయానికి అందజేశారు ఈ సందర్భంగా దాతలను ప్రత్యేకంగా అభినందించి భాస్కర్ ఖాజా హుస్సేన్ లను పూలహారాలు శాలువాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఓబిరెడ్డి శ్రీరాములు నీలూరు లక్ష్మయ్య సిపిఐ నాయకులు ఆంజనేయులు వెంకటస్వామి మల్లారెడ్డి ఆదినారాయణ రెడ్డి జూటూరు ఫైరోజ్ భాష చికెన్ సెంటర్ మాబు తదితరులు పాల్గొన్నారు.

సేవా రత్న రాష్ట్ర అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు ఎ. శ్రీనివాసులు.



పావగడ: అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం. పావగడ:: ఉపాధ్యా యుడిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది, పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన ప్రస్తుత వెంకటేశ్వర పాఠశాల ఉపాధ్యాయుడు ఎ. శ్రీనివాసులుకు సేవా రత్న రాష్ట్ర అవార్డు లభించింది. పట్టణంలోని ఎస్ఎస్కె కమ్యూనిటీ హాల్‌లో డా. ప్రభాకర రెడ్డి ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కార, సేవా రత్న అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఎస్సీ విశ్రాంత ప్రొఫెసర్ కె.పి.జె. రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు డా. చక్రధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అమ్మయ్య తిమ్మరాజు, కెఇబి విశ్రాంత చీఫ్ ఇంజనీర్ వెంకటశివారెడ్డి, పట్టణ ప్రణాళిక శాఖ విశ్రాంత డైరెక్టర్ ధనంజయ రెడ్డి, విజయ శ్రీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి బి.వి. అంజన శెట్టి, సాహితీవేత్త గుణవంత మంజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సేవా సంకల్ప అభియాన్



సోమందేపల్లి అక్టోబర్ 4 సీమ వార్త సాయంకాలం మండల పరిధిలోని చాకర్లపల్లి గ్రామంలో బిజెపి యువ నాయకుడు పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో మోడీ సేవా సంకల్ప అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రంగోలి (ముగ్గుల) పోటీలు అత్యంత వైభవంగా చేపట్టారు. పోటీలలో గ్రామ మహిళలు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని నెలరోజుల పాటు ఈ సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. సమాజంలో ప్రతి వర్గానికి చేరువవుతూ సేవా సమర్పణ భావాలను పెంపొందించడమే ఈ అభియాన్ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. గ్రామస్థాయి మహిళలకు ప్రోత్సాహం అందించేందుకు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ఈ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోటీలు పాల్గొన్న ప్రతి మహిళలకు జ్ఞాపికలు బహుమతులను అందజేసి వారిని అభినందించారు. రాబోయే రోజులలో మండల వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు మొక్కలు నాటడం స్వచ్ఛభారత్ ఉచిత వైద్య శిబిరాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పార్థసారథి రెడ్డి వెల్లడించారు.

రైతులకు సబ్సిడీ ఉలవ విత్తనాలు పంపిణీ

ఓబులదేవరచెరువు (సెప్టెంబర్5)సీమవార్త: సాయంత్రం. మండల వ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఉలవ విత్తనాలు అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు.80 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తోంది అన్నారు.పది కిలోల బస్తా పూర్తి ధర రూ.740 కాగా 80 శాతం సబ్సిడీ రూ.592 పోను రైతులు కేవలం రూ.148 రూపాయలు చెల్లించాల్సింది ఉంటుందన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఆధార్ కార్డు,పట్టాదారు పాసుపుస్తకం మరియు సంబంధిత లింకు నంబర్ గల ఫోను తీసుకొచ్చి రైతు సేవ కేంద్రాలకు వెళ్లి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కోరారు.

రిజర్వేషన్లుకు అడ్డు తగిలితే పోరాటం ఉధృతం చేస్తాం.

జేపీసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ



అమరాపురం అక్టోబర్ 4 సీమవార్త సాయంత్రం రాజ్యాంగ హక్కుల్లో భాగమైన ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లుకు అడ్డు తగిలితే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఎస్సీ ఎస్టీ సంఘాల జేపీసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది శివరామకృష్ణ, డి హెచ్ పి ఎస్ అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు లు హెచ్చరించారు.ఆదివారం అమరాపురం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం వారు రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ రిజర్వేషన్ రక్షించుకోవడం అంశంపై అంబేద్కర్ స్మృతి వనం గౌరవాధ్యక్షుడు ఎ. నారాయణప్ప అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ కుల ప్రజాసంఘాల నాయకులు పాల్గొని రిజర్వేషన్ల సమస్యలపై మాట్లాడారు.ఎస్సీ,ఎస్టీల చైతన్య,అభివృద్ధిని ఓర్వలేక కుట్రలు పన్నుతున్నారని నాయకులు వాపోయారు.6శాతం జనాభాకు 10శాతం రిజర్వేషన్ కల్పించడం సిగ్గు చేటని పేదరికం,వివక్షతలో మగ్గుతున్న దళిత,గిరిజనలపై అక్కసు వెలగక్కడం విడ్డురమన్నారు.విద్య,వైద్యం ప్రైవేటు పరం చేసి కోట్లకు పడగలెత్తడమే కాక సంపద మొత్తం ధనికుల చేతుల్లో ఉందన్నారు.ఎస్సీ, ఎస్టీలు విద్య,ఉద్యోగ రంగాల్లో ఓపెన్ క్యాటగిరిలో రానిస్తున్న రిజర్వేషన్ లోకి నెట్టి వేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పెట్టారని వాటిని ప్రశ్నించే నాథుడు లేడన్నారు.రాజ్యాంగ హక్కులైన రిజర్వేషన్ ఫలాలను సాధించుకోవడానికి రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సమాఖ్య నారాయణ ప్ప,సీనియర్ దళిత నాయకులు మాజీ ఎంపీపీ ఎల్ కె నరసింహప్ప, తిమ్మలాపురం బి హెచ్ రాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, కెంచప్ప, మాల మహానాడు తాలుకా ఉపాధ్యక్షుడు జయరామప్ప, టీచర్లు నరసింహమూర్తి, సిటీ తిప్పేస్వామి,యంజారప్ప, మడకశిర ఎంఆర్పిఎస్ రఘు ,న్యాయవాదులు రవి కుమార్,గోపాల్ కృష్ణ,శశి కుమార్ ,హరి, మాజీ మెంబర్ సిద్దేశ్ ,జై భీమ్ రఘు, ఆలదపల్లి నరసింహమూర్తి, మాజీ ఉప సర్పంచ్ కరియప్ప వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమల్లోకి కొత్త మున్సిపల్ చట్టం..

-మొదటిపేజీ తరువాయి

భవనాల్లో అగ్నిప్రమాదాల ముప్పు వంటి కొత్త సవాళ్లు వచ్చాయి. ఈ మార్పులకు అనుగుణంగా నగర పాలనా వ్యవస్థను మార్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. మూడు కార్పొరేషన్ల ప్రస్తుత సరిహద్దులు మాత్రం మారవు. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ, కమిషనర్, వార్డు కమిటీ వ్యవస్థ కొనసాగుతుంది. ఐదేళ్ల పదవీకాలం కూడా యథాతథంగా ఉంటుంది.

ఇంటి రిజిస్ట్రేషన్‌తోనే మ్యుటేషన్?

ఇంటి కొనుగోలు తర్వాత మ్యుటేషన్‌కు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని కొత్త చట్టం తగ్గించనుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యూటేషన్ ఆటోమేటిక్‌గా కొనసాగుతుంది. ప్రతి ఆస్తికి ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ ఇస్తారు. ఆస్తికి సంబంధించిన మున్సిపల్ వివరాలన్నీ ఈ గుర్తింపు సంఖ్యతో అనుసంధానమవుతాయి. ఆస్తిపన్ను, నీటి బిల్లు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలను కలిపి 'క్యూర్--1' పేరుతో ఒకే బిల్లు ఇస్తారు. మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులను ఒకే పోర్టల్ ద్వారా పొందే విధానం వస్తుంది.

ఆస్తిపన్ను పెంపుపై పరిమితి

ఈ కొత్త చట్టంలో ఆస్తిపన్ను విధానంలో కీలక మార్పు చేశారు. ఇక వార్షిక అద్దె విలువకు బదులుగా రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే గైడ్‌లైన్ విలువ ఆధారంగా పన్ను లెక్కిస్తారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు రూ.101 నామమాత్రపు పన్నే కొనసాగుతుంది.

బ్రిడ్జి పనులను పరిశీలించిన తెదేపా నాయకులు



సోమందేపల్లి అక్టోబర్ 3 సీమ వార్త సాయంకాలం మండలం కేంద్రంలోని పందిపర్తి, మంచేపల్లి గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న కాలువ సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామస్థుల అభ్యర్థన మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ చొరవ తీసుకుని బ్రిడ్జి మంజూరు చేయించారు.ఈ నెల 9వ తేదీన బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు కాలువ వద్ద నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజలకు కాలువ దాటే ఇబ్బందులు తొలగనున్నాయి.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర (ఉప్పర) కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణప్ప, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్,మండల కన్వీనర్ వెంకటేష్, సిద్ధిలింగప్ప, రామకృష్ణ, చాకర్లపల్లి శ్రీరామ్ సోమందేపల్లి పట్టణ కన్వీనర్ సూరి, శ్రీనివాస్ రెడ్డి, భానుకీర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

వంటి కాళ్లతో నిలబడి వీఆర్ఏల నిరసన



మడకశిర అక్టోబర్ 4 సీమ వార్త సాయంకాలం సమస్యల పరిష్కరించాలని కోరుతూ విఆర్ఏలు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరుకొంది. దానిలోని భాగంగానే వీఆర్ఏలు వినూత్న రీతిలో ఒంటి కాళ్లతో నిలబడి నిరసన తెలియజేశారు. గత 19 రోజులుగా సమ్మె చేపట్టిన ప్రభుత్వము స్పందించకపోవడంతో తమ సమస్యల పరిష్కారానికి దశలవారీగా సమ్మె కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా వీఆర్ఏలు నాగరాజు తదితరులు తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి





మడకశిర అక్టోబర్ 4 సీమ వార్త సాయంకాలం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు మహానగర పరిధిలోని బ్యాటరాయణపురం, క్షేత్రపాలేనహళ్లి, గ్రామంలో ఆదివారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో యాదవ ఈరన్న ఆహ్వానం మేరకు నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యాదవ సోదరులు, భక్తులతో కలిసి జన్మాష్టమి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ప్రతినిధులు గోవిందపురం జయరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలి

....మాల మహానాడు మండల అధ్యక్షులు విరుపసముద్రం నరసింహమూర్తి



అమరాపురం అక్టోబర్ 4 సీమ వార్త సాయంత్రం రాష్ట్రంలోఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం రుణాలపై ఆశలు పెట్టుకున్న అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి తక్షణమే రుణాలు అందించి ఆదుకోవాలని అమరాపురం మండల మాల మహానాడు అధ్యక్షులు విరుపసముద్రం నరసింహమూర్తి డిమాండ్ చేశారు.ఎస్సీ కార్పొరేషన్ రుణాల ద్వారా చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టి తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని అనేక మంది పేద ఎస్సీ యువత ఎదురుచూస్తున్నాయన్నారు. అయితే రుణాలు మంజూరు కాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.స్వయం ఉపాధి కోసం ప్రభుత్వ సాయం అందుతుందనే నమ్మకంతో దరఖాస్తు చేసుకున్న వారికి నిరీక్షణే మిగలడం అన్యాయమన్నారు. అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. . రుణాల మంజూరులో జాప్యం కారణంగా స్వయం ఉపాధి ప్రారంభించాలనుకునే యువతకు అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలను తక్షణమే మంజూరు చేసి, వెంటనే నిధులను విడుదల చేయాలని ఆయన కోరారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881